సాక్షి ఖమ్మం

గురువారం । 5 । డిసెంబర్ । 2024



ప్రణాళికాయుతంగా ముందుకు..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో హాజరు శాతంతో పాటు ఉత్తీర్ణత పెరిగేలా అధ్యాపకులు ప్రణాళిక రూపొందించారు. 8లో



ఇంజనీర్ల బాహాబాహీ

కేఎంసీలో ఇద్దరు ఇంజనీర్ల నడుమ నగదు విషయమై వాగ్వాదం జరగగా బాహాబాహీకి దిగిన ఘటన వెలుగుచూసింది. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
31° / 22°

వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ ఉన్నా, సాయంత్రానికి చలిగాలులు మొదలవుతాయి.

న్యూస్‌రీల్

31లోగా ఫ్యాక్టరీల లైసెన్స్ ఫీజు చెల్లించండి

ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి జిల్లాలోని ఫ్యాక్టరీల యజమానులు 2025 ఏడాదికి సంబంధించి లైసెన్స్ ఫీజు ఈనెల 31వ తేదీలోగా చెల్లించాలని ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకన్న సూచించారు. ఫీజును tsfactories.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా లేదా మీ సేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ నంబర్ ద్వారా చెల్లించవచ్చని తెలిపారు. ఫీజు చెల్లించని పక్షంలో వచ్చే నెల 1న లైసెన్సులు రద్దు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యజయానులు వివరాల కోసం 94400 90280 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

జమలాపురంలో ప్రజాపాలన విజయోత్సవాలు



చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ అర్చకులు చండీహోమం జరిపించారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ విజయకుమారి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీ ప్రారంభం



డిస్పెన్సరీని ప్రారంభిస్తున్న ప్రాంతీయ డైరెక్టర్ గౌమింతంగ్

ఖమ్మంవైద్యవిభాగం: ఉమ్మడి జిల్లాలోని ఈఎస్ఐ లబ్ధిదారుల సౌకర్యార్థం ఖమ్మం రాపర్తినగర్‌లోని బీఎస్ఎన్ఎల్ భవన ప్రాంగణంలో డిస్పెన్సరీ, బ్రాంచ్ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యాలయాన్ని ఈఎస్ఐ తెలంగాణ ప్రాంతీయ డైరెక్టర్ గౌమింతంగ్ గాంగ్టే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం, ప్రసూతి, వృత్తిపరమైన ప్రమాదాలు, శాశ్వత వైకల్యం బారిన పడినవారే కాక డిపెండెంట్ ప్రయోజనాలను ఈ కార్యాలయం ద్వారా పొందొచ్చని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ డీజీఎం డి.శ్రీనివాసరావు, ఈఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్లు మహేష్ నాదల, మారేందెడ్డి వినయ్, వేదప్రకాష్, సూపరింటెండెంట్ డి.రఘునాథ, బ్రాంచ్ మేనేజర్ జి.సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పక మందులు వాడితే ఫలితం



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: హెచ్ఐవీ బాధితులు క్రమం తప్పకుండా ఏఆర్‌టీ మందులు వాడితే ఫలితం ఉంటుందని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.కళావతిబాయి తెలిపారు. ఏఆర్‌టీ మందులు వాడుతూ జీవనం కొనసాగిస్తున్న వారికి బుధవారం జిల్లా పెద్దాస్పత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో పోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ బాధితులు మందులు వాడడంతో పాటు పౌష్టికాహారం తీసుకుంటూ జీవితకాలాన్ని పెంచుకోవాలన్నారు. అనంతరం అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, వైద్యులు సురేందర్, మోహన్‌రావు, లక్ష్మణ్‌రావు, జయకుమార్, ఉద్యోగులు సత్యకుమార్, మహమూద్ అలీ, వీరయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

9, 10న జిల్లా స్థాయి సైన్స్ ఫేర్

ఖమ్మం సహకారనగర్: జిల్లా స్థాయి సైన్స్ ఫేర్ నిర్వహణకు తేదీలు ఖరారయ్యాయి. ఈనెల 9, 10వ తేదీల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహణకు అధికారులు నిర్ణయించారు. ఖమ్మం బల్లేపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్‌ను ఎంపిక చేయగా.. ఎగ్జిబిట్లు తీసుకొచ్చేలా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎంఈఓలు, హెచ్ఎంలకు అధికారులు సూచించారు.

జిల్లాలో ఐదు సెకన్ల పాటు కంపించిన భూమి

- పలువురి ఇళ్లలో కదిలిన కుర్చీలు, మంచాలు
- శబ్దాలతో అయోమయానికి గురైన ప్రజలు
- ఏం జరుగుతుందోనన్న భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు

ఖమ్మం రాపర్తినగర్-2లో ఇళ్ల నుంచి బయటకు వచ్చిన కాలనీవాసులు





ప్రకంపనల కలకలం

జిల్లాలో భూప్రకంపనలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. బుధవారం ఉదయం 7.27 గంటల సమయాన భూకంపం సంభవించింది. దీంతో ఏం జరుగుతుందోనని ప్రజలు అయోమయానికి గురయ్యారు. కొందరు బయట ఏదైనా జరిగిందా అని ఆలోచనలో పడగా.. ఇంకొందరు మాత్రం భూకంపంగా గుర్తించారు. ఈ ప్రకంపనలు స్వల్పంగానే ఉండడంతో ఎలాంటి నష్టం జరగలేదు. ఉమ్మడి జిల్లాలో ఐదు సెకన్ల పాటు ప్రకంపనలు కొనసాగగా రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదైంది. గోదావరి బేసిన్‌లోని భూమి పొరల్లో కదలికలతో స్వల్ప భూకంపం సంభవించగా.. ఉమ్మడి జిల్లాలో గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ములుగు కేంద్రంగా..

ములుగు జిల్లా కేంద్రానికి సమీపాన భూకంపం వచ్చినట్లు ఎన్‌సీఎస్(నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ) ప్రకటించింది. ఉదయం 7.27.02 గంటలకు ప్రకంపనలను గుర్తించారు. భూకంప కేంద్రం వద్ద 40 కిలోమీటర్ల లోతులో ఇవి ఏర్పడగా నలువైపులా వ్యాప్తి చెందడంతో తెలుగు రాష్ట్రాల్లో ప్రభావం కనిపించింది. భూకంప నాభి కేంద్రం వద్ద నుంచి ప్రకంపనలు నలువైపులా 250 కి.మీ. వరకు వెళ్లాయి. నాభి కేంద్రంలో తీవ్రత 5.3 ఉండగా.. దూరం పెరిగే కొద్దీ తగ్గుతూ వచ్చింది. గతంలోనూ ఈ ప్రాంతాల్లో స్వల్ప భూకంపాలు సంభవించాయి. 1969లో భద్రాచలంలో అత్యధికంగా 6 తీవ్రతతో భూకంపం వచ్చింది. ఆ తర్వాత కూడా రెండుసార్లు భూమి స్వల్పంగా కంపించింది.

విన్నా.. ఇప్పుడు చూశా..



భూకంపం వచ్చిందని పేపర్లలో చదవడమే తప్ప ఎప్పుడూ చూడలేదు. నేను ఉదయం ఆలయంలో ఉన్నప్పుడు ఒక్కసారిగా భూమి కంపించింది. ఆ వెంటనే చక్కబడడంతో బయట ఆరా తీయగా భూకంపం అని తెలియడంతో ఆందోళన చెందాను. ఎలాంటి ఉపద్రవం జరగకపోవడం ఆనందంగా ఉంది.

– ఎం.మురళీకృష్ణ, అర్చకుడు, చిమ్మపుడి

నిద్రలో ఉండగానే...

చలికాలం కావడంతో ఉదయం 7.30 గంటలకు ఇంకా చాలా మంది నిద్ర వీడలేదు. ఆ సమయాన కదలికలు రావడంతో మంచాలపై, కుర్చీల్లో ఉన్న వారు గుర్తించారు. కొన్నిచోట్ల పాత్రలు కింద పడడం, ఇళ్ల బయట శబ్దాలు రావడంతో కొందరు కోతులు ఇళ్లపైకి దూకాయని భావించగా.. మరికొందరు బయట ఏదో జరుగుతుందని భావించారు. ప్రధానంగా అపార్ట్‌మెంట్లు, ఇళ్లలోని మొదటి అంతస్తులో ఉన్న వారికి భూకంప తీవ్రత తెలిసింది.

ఉరుకులు.. పరుగులు

భూకంపం వచ్చినట్లు సామాజిక మాధ్యమాలు, టీవీల ద్వారా తెలియగానే జిల్లావ్యాప్తంగా ప్రజలు కంగారు పడ్డారు. ఈ క్రమంలో కొందరు ఆందోళనతో.. మరికొందరు ఆసక్తితో బయటకు వచ్చి చర్చలు మొదలు పెట్టారు. భూకంపం ఎలా వచ్చింది.. అప్పుడు తామేం చేస్తున్నాం.. ఎలా భయపడ్డాం అని చెప్పుకున్నారు. ఇక రోజంతా సోషల్ మీడియాలో ఇదే అంశంపై చర్చ కొనసాగింది.

- సత్తుపల్లిలో అత్యధికంగా 10 సెకన్ల పాటు భూమి కంపించినట్లు తెలిసింది.
- ఖమ్మంలోని ఇందిరానగర్, చైతన్యనగర్, రఘునాథపాలెం మండలాల్లో ప్రజలు ఆందోళనతో బయటకు వచ్చారు.
- రఘునాథపాలెం మండలం చిమ్మపూడిలోని పలు ఇళ్లల్లో ఉన్న సామగ్రి కదిలి కిందపడ్డాయని తెలిసింది.
- సత్తుపల్లి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి, చింతకాని, ఎర్రుపాలెం, ముదిగొండ, కల్లూరు, వైరా, కారేపల్లి, కొణిజర్ల మండలాల్లో ప్రజలు ఆందోళనతో ఇళ్ల బయటే చాలాసేపు గడిపారు.
- నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురంలోని సబ్‌స్టేషన్‌లో తలుపులు ఊగడంతో విధుల్లో ఉన్న సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. అలాగే, మరికొన్ని గ్రామాల్లోని ఇళ్లలో పాత్రలు కింద పడడంతో ఆందోళన చెందారు.
- తల్లాడ మండలం రంగబంజర గ్రామ కార్యదర్శి ఇంట్లో భూమి కంపించడంతో సామగ్రి కింద పడ్డాయి. బిల్లుపాడుకు చెందిన నారపోగు అక్కమ్మ, తల్లాడకుచెందిన షేక్ మెహరాజ్ ఇళ్లలో స్లాబ్ పెచ్చులు ఊడి పడ్డాయని తెలిపారు.

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను..



ఒక్కసారిగా భూమి కదలడంతో ఉలిక్కిపడ్డాను. కూర్చున్న కుర్చీ కదలడంతో భయపడ్డాను. మా చికెన్ షాపులో సామగ్రి అటూఇటు కదలడంతో శబ్దం వచ్చింది. తలుపులు ఎవరో ఊపుతున్నట్లు అనిపించి ఆరుబయటకు వెళ్లాను. అయితే, అది కొద్దిసేపు మాత్రమే ఉండడంతో ఆందోళన తగ్గింది.

– తేజావత్ మల్లికార్జున్, మంగాపురంతండా

ప్రశాంతంగా 'న్యాస్' పరీక్ష



తల్లాడ బాలభారతి విద్యాలయంలో పరీక్షను పరిశీలిస్తున్న డీఈఓ శర్మ

ఖమ్మం సహకారనగర్/తల్లాడ: జిల్లాలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ సాధన సర్వే(న్యాస్) పరీక్ష బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఈమేరకు 97 పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి విద్యార్థులు 5,434మంది హాజరయ్యారు. పలు కేంద్రాలను కేంద్రప్రభుత్వ పరిశీలకుడు సందీప్ తివారీతోపాటు డీఈఓ సోమశేఖరశర్మ, డీసీఈబీ కార్యదర్శి నారాయణ, ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ, జిల్లా కోఆర్డినేటర్ రాజన్ పరిశీలించారని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రవికుమార్ తెలిపారు. కాగా, తల్లాడ మండలం బిల్లుపాడు ఉన్నత పాఠశాల, తల్లాడ బాలభారతి విద్యాలయంలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను డీఈఓ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష నిర్వహణపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అలాగే, బిల్లుపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన చేసిన ఆయన మెనూ అమలుపై ఆరా తీశారు. ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్, హెచ్ఎం ఎ.జోసఫ్ పాల్గొన్నారు.

సిద్ధమైన ఫుడ్‌పార్క్

నేడు ప్రారంభించనున్న మంత్రులు



సిద్ధమైన సభావేదిక వద్ద అధికారులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మండలం బుగ్గపాడులో ఫుడ్‌పార్కు ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం ఈ పార్క్‌ను ప్రారంభిస్తారని అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్ పర్యవేక్షణలో తెలంగాణ పారిశ్రామిక మౌళిక సదుపాయల సంస్థ అధికారులు సభావేదిక, ఇతర ఏర్పాట్లు చేశారు.

69మంది గ్రూప్-4 ఉద్యోగుల కేటాయింపు

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల గ్రూప్-4 ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. పెద్దపల్లిలో బుధవారం జరిగిన సభలో వీరికి ఉత్తర్వులు అందజేయగా.. 69 మందిని జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలకు కేటాయించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల్లో వార్డ్ ఆఫీసర్లు, జూనియర్ అసిస్టెంట్లుగా పోస్టింగ్ ఇచ్చారు. అయితే, కేఎంసీ, మున్సిపాలిటీల వారీగా కేటాయించిన ఉద్యోగుల వివరాల జాబితా వెలువడాల్సి ఉంది.

అటవీ శాఖ కార్యాలయాలు ప్రారంభం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో రూ.2.53 కోట్లతో నిర్మించిన టీజీఎఫ్‌డీసీ డివిజనల్ కార్యాలయం, డివిజనల్ మేనేజర్, ప్లాంటేషన్ మేనేజర్ల క్వార్టర్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈమేరకు కార్యాలయం వద్ద శిలాఫలకాన్ని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ జి.గణేష్, ప్లాంటేషన్ మేనేజర్లు వి.బ్రహ్మాచారి, ఎస్.నాగరాజు, ఎస్.చంద్రకళ, ఎఫ్‌డీఓ వి.మంజుల, ఎఫ్ఆర్‌ఓ స్నేహలత పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు

రానున్న వేసవి సీజన్‌లో అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా అటవీశాఖ అధికారి ఆదేశించారు. సత్తుపల్లి అర్బన్ పార్కును బుధవారం సత్తుపల్లి ఎఫ్‌డీఓ వి.మంజులతో కలిసి సందర్శించిన ఆయన వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఆతర్వాత అధికారులతో సమావేశమైన డీఎఫ్ఓ మాట్లాడుతూ రాలిన ఆకులను బ్లోయర్లతో శుభ్రం చేయించాలని, పశువుల కాపరులకు అడవిలోకి వెళ్లేటప్పుడు అగ్గిపెట్టెలు తీసుకెళ్లకుండా పర్యవేక్షిస్తూనే అడవుల్లో జాతరలు జరిగితే వంటలు చేయకుండా చూడాలన్నారు. రేంజర్ పి.స్నేహలత, వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పర్ట్ దీపక్‌రామాయణ్, డీఆర్ఓ ముత్యాలరావు, సెక్షన్ ఆఫీసర్ నర్సింహా, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



కార్యాలయం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాగమయి, డీఎఫ్ఓ సిద్ధార్థ్

లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

- సిద్ధంగా ఉన్న 'డబుల్' ఇళ్ల మంజూరుకు కార్యాచరణ
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో నిర్మాణాల పూర్తయి వసతులు కల్పించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపునకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 135 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు సిద్ధమై, అర్హులను ఎంపిక చేసినందున దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, నిరుపేదల వివరాలను ఈనెల 7వ తేదీలోగా అందించాలన్నారు. అలాగే, ఖమ్మం అర్బన్‌లోని ఇళ్లలో నాలుగింటిని ట్రాన్స్‌జెండర్లకు కేటాయించాలని, అర్హుల జాబితా సిద్ధం కాని 470 ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఇక నిర్మాణం పూర్తయిన 635 ఇళ్లలో సౌకర్యాల కల్పన, పాక్షికంగా నిర్మాణాలు జరిగిన 702 ఇళ్ల పూర్తికి కావాల్సిన నిధుల ప్రతిపాదనలు ఇవ్వాలని తెలిపారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్డీఓ సన్యాసయ్య, డీఆర్వో రాజేశ్వరి, హౌజింగ్ ఈఈ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ హేమలత పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి..

ఖమ్మంమయూరిసెంటర్: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగితే మంచి భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో వసతిగృహాల విద్యార్థులకు నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో విజేతలకు కలెక్టర్ బుధవారం బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన తనను వారికి అన్నగా పరిచయం చేసుకుని మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని, అందుకే పిల్లల్లో ప్రతిభను వెలికితీసేలా పోటీలు నిర్వహించామన్నారు. కాగా, విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా ఉపాధ్యాయులు చదువుతోపాటు క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా బీసీ సంక్షేమ అధికారి గుడికందుల జ్యోతి, డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పాఠశాలల్లో పనివేళల్లో సమావేశాలేమిటి?

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ, అనుబంధ పాఠశాలల పనివేళల్లో యూనియన్ల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలియడంతో జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మపై కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. గురువారం నుంచి పాఠశాలల పనివేళల్లో ఇలాంటివి జరగకుండా చూడాలని ఆదేశించినట్లు సమాచారం. ఈమేరకు హెచ్ఎంలు, యూనియన్ల బాధ్యులకు డీఈఓ సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తీసుకునేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం.

14న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్, పక్కన నూతన న్యాయమూర్తులు శ్రీనయ్య, శివరంజని తదితరులు

- రాజీ మార్గాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

ఖమ్మంలీగల్: రాజీ మార్గమే రాజమార్గమని గుర్తించి అర్హత కేసుల్లో రాజీ పడడం ద్వారా సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టి.రాజగోపాల్ సూచించారు. జిల్లా కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థ హాల్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఈనెల 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ వివరాలను వెల్లడించారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుంటే త్వరగా కేసులు పరిష్కారమవుతాయని, తద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని తెలిపారు. ఎలాంటి ఫీజు లేకుండా న్యాయ సేవా సంస్థ సహకారంతో ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని చెప్పారు. కాగా, గత లోక్ అదాలత్ ద్వారా జిల్లాలో 10,712 కేసులు పరిష్కరించి రాష్ట్రంలోనే ఏడో స్థానంలో నిలిచామని వెల్లడించారు. త్వరలో జరిగే లోక్ అదాలత్ కోసం 6,277 కేసులు గుర్తించగా, ఇంకా ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషిచేస్తున్నామని జిల్లా జడ్జి తెలిపారు. ఈ సమావేశంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నెరేళ్ల శ్రీనివాసరావు, న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి సహకరించాలి

కేసులు సత్వర పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని జిల్లా జడ్జి టి.రాజగోపాల్ సూచించారు. నూతన న్యాయమూర్తుల పరిచయ కార్యక్రమం సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయమూర్తులు కె.ఉమాదేవి, వెంపటి అపర్ణ, ఎం.అర్చనాకుమారి, దేవినేని రాంప్రసాద్‌రావు, కే.వీ.చంద్రశేఖరరావు, కాసరగడ్డ దీప, బిక్కం రజిని, ఏపూరి బిందుప్రియ, రాళ్లబండి శాంతిలత, వినుకొండ మాధవి పాల్గొన్నారు.

నూతన జడ్జిలు వీరే...

నూతనంగా విధుల్లో చేరిన మహిళా కోర్టు న్యాయమూర్తి వశుకుల శ్రీనయ్య స్వస్థలం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం మల్లేపల్లి. ఎల్ఎల్ఎం పూర్తిచేశాక 2006నుండి 2012వరకు ప్రాక్టీస్ చేశారు. 2012 నుంచి 2024 వరకు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసిన ఆయన డిస్ట్రిక్ జడ్జిగా ఎంపికై ఖమ్మం జిల్లా మహిళా కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అలాగే, సీనియర్ సివిల్ జడ్జి శివరంజని హైదరాబాద్‌లో సూర్యప్రకాశరావు – నీలాదేవి దంపతులకు జన్మించగా మహాత్మాగాంధీ లా కాలేజీలో న్యాయవాద విద్యనభ్యసించారు. హైదరాబాద్ పీజీ కాలేజీలో ఎల్ఎల్ఎం పూర్తిచేశాక 2016లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. వరంగల్, హుస్నాబాద్‌లో విధులు నిర్వర్తించిన అనంతరం పదోన్నతిపై ఖమ్మం అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు.

రబీ పంటలకు సాగర్ జలాలు

- ఈనెల 10నుండి విడుదలకు కసరత్తు
- ఆన్ – ఆఫ్ విధానంలో ఏప్రిల్ వరకు అందించాలని ప్రణాళిక

ఖమ్మంఅర్బన్: జిల్లాలోని ఆయకట్టులో రబీ పంటల సాగు కోసం ఈనెల 10నుండి సాగర్ జలాలు విడుదల చేయాలని జలవనరులశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించినట్లు తెలిసింది. జిల్లావ్యాప్తంగా 17 మండలాల పరిధిలో 2.34 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. అయితే, రైతులు ఆరుతడి పంటలు సాగుచేసేలా అవగాహన కల్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఆతర్వాత షెడ్యూల్ రూపొందించి ఉన్నతాధికారుల ఆమోదం తీసుకుంటారు. ఇప్పటికే జిల్లా అధికారులు నీటి విడుదలకు సంబంధించి డివిజన్ల వారీగా గణాంకాలు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఈనెల 10వ తేదీ నుండి ప్రధాన కాల్వలో ప్రవాహాన్ని నిరంతరం కొనసాగిస్తూ బ్రాంచ్‌కాల్వలు, మేజర్లలో మాత్రం తొమ్మిది రోజులు ఆన్, ఆరు రోజులు ఆఫ్ విధానంలో పూర్తి ఆయకట్టుకు ఏప్రిల్ వరకు నీరందించాలనేది లక్ష్యంగా తెలుస్తోంది.



సాగర్ కాల్వ (ఫైల్)

ఆరు తడి పంటలే సాగుచేసేలా...

రైతులు ఖరీఫ్‌లో అత్యధికంగా వరి సాగు చేశారు. సన్నధాన్యం సాగు చేసిన రైతులకు రూ.500చొప్పున బోనస్ చెల్లించగా రబీలో చెల్లించనున్నట్లు ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. దీంతో సాగర్ ఆయకట్టు రైతులు రబీలోనూ అత్యధికంగా వరి వేస్తే చివరి దశలో నీటి అవసరం పెరిగి ఆఖరి భూములకు అందక రైతుల నుండి ఒత్తిడి వచ్చే అవకాశముంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ముందుగానే ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతులను చైతన్యపర్చాలని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. గత ఏడాది కూడా రబీలోనూ నీటి సమస్య ఎదురై చివరి ఆయకట్టు రైతులు ఇబ్బంది పడ్డారు. కొందరు రైతులు పంటలను కాపాడుకునేందుకు విద్యుత్, డీజిల్ మోటార్లు ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. ఈనేపథ్యాన ఆరుతడి పంటలే సాగుచేసేలా విస్తృత అవగాహన కల్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

క్లుప్తంగా

కేఎంసీ ఇంజనీర్ల బాహాబాహీ

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్థిక లావాదేవీల విషయమై ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఇద్దరు ఇంజనీరింగ్ అధికారులు బాహాబాహీకి దిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేఎంసీలో పనిచేసిన పూర్వ ఇంజనీర్ అధికారి, ప్రస్తుతం విధుల్లో ఉన్న మరో అధికారి నగదు విషయంలో మంగళవారం రాత్రి గొడవ పడి ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై బుధవారం కార్యాలయంలో చర్చ జరిగింది. ఈ వివాదంపై ఓ అధికారిని సంప్రదించగా.. వాగ్వాదం జరిగింది నిజమేనని తెలిపారు. కాగా, గొడవ పడిన వారిద్దరు పోలీస్‌స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

మెడ్‌ప్లస్‌లో ఉద్యోగాలకు రేపు జాబ్‌మేళా

ఖమ్మంరాపర్తినగర్: ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈ నెల 6న జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు జిల్లా ఉపాధికల్పన శాఖ అధికారి ఎస్.మాధవి తెలిపారు. మెడ్‌ప్లస్‌లో ఫార్మసిస్ట్, సీఎస్‌ఏ, జూనియర్ అసిస్టెంట్, ఆడిట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయని పేర్కొన్నారు. ఫార్మసిస్ట్ పోస్టుకు బీఫార్మసీ లేదా ఫార్మాడీ ఉత్తీర్ణులైన వారు, మిగిలిన పోస్టులకు ఎస్సెస్సీ మొదలు డిగ్రీ వరకు చదివిన వారు హాజరుకావొచ్చని వెల్లడించారు. 18 నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగిన వారు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని, వివరాలకు 93469 91009 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జిల్లా మహిళల కబడ్డీ జట్టు ఎంపిక



జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో పీఈటీలు

ఖమ్మంస్పోర్ట్స్: ఈ నెల 7 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు సీనియర్స్ విభాగంలో జిల్లాకబడ్డీ జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీలకు 52 మంది హాజరుకాగా, జట్టు కు ఎంపికై న క్రీడాకారుల వివరాలను అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు దయాకర్‌రెడ్డి, కె.క్రిస్టోఫర్ బాబు ప్రకటించారు. జట్టుకు ఎంపికైనవారిలో కె.భవాని, కె.అఖిల, ఎం.స్వప్న, ఎం.కుసుమ, పి.విజయ శ్రీ, బి.ప్రియాంక, కె.నందిని, సీహెచ్.చంద్రకళ, ఎస్.పూజిత, బి.హనీ, బి.హారిక, అమీనాబేగం, వై.నిఖిత, బి.భావన, సీహెచ్.కావ్య ఉన్నారు. పోటీలను సత్యనారాయణ, లాలయ్య, శేఖర్, శోభన్, శివకృష్ణ, శివజ్యోతి, శ్రీను, పద్మ, సుస్మిత తదితరులు పర్యవేక్షించారు.

భవిష్యత్ తరాలకు విద్యార్థులే మార్గదర్శకులు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రాయల, నాయకులు

ముదిగొండ: శ్రద్ధగా చదివి ఉన్నతస్థాయికి ఎదగడం ద్వారా భవిష్యత్ తరాలకు విద్యార్థులే మార్గదర్శకాలు నిలుస్తారని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సూచించారు. ముదిగొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన రాయల మెనూ అమలు, భోజనం నాణ్యతపై ఆరాతీశారు. అలాగే, జూనియర్ కళాశాలకు రూ.1.50 లక్షల విలువైన టీవీని అందజేస్తామని తెలిపారు. కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చింతకాని: మండలంలోని జగన్నాథపురం సమీపాన నాలుగు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు బుధవారం సీజ్ చేశారు. చిన్నమండవ మున్నేరు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు తేలడంతో సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,800	4,300
మిర్చి	15,600	6,500
మిర్చి తాలు	5,000	5,000
ఏసీ మిర్చి	16,525	7,100
ఏసీ తాలు	8,500	5,000
పత్తి	7,100	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,413

ప్రణాళికాయుతంగా ముందుకు..

- ఇంటర్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- హాజరు శాతం, ఫలితాల పెంపుపై దృష్టి
- సత్వర అవసరాలకు త్వరలోనే నిధుల కేటాయింపు



నయాబజార్ కళాశాలలో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ప్రిన్సిపాల్ రామారావు

ఖమ్మంసహకారనగర్: ఇంటర్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరిగేలా ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఇదే సమయాన హాజరు శాతం పెంపు, డ్రగ్స్‌కు అలవాటు కాకుండా చూసేలా శ్రద్ధ వహిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యాశాఖ కమిషనర్ ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు, ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. ఈ మేరకు సమీక్షలో చేసిన సూచనల అమలుకు జిల్లా అధికారులు ప్రణాళిక రూపొందించారు.

5 వేల మందికి పైగానే విద్యార్థులు

జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా 5,571 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రథమ సంవత్సరంలో 2,931 మంది, ద్వితీయ సంవత్సరంలో 2,640 మంది ఉన్నారు. అయితే, సరాసరి 50 నుంచి 60 శాతం మాత్రమే హాజరు నమోదవుతోంది. ఈ క్రమాన విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు దృష్టి సారించాలని, అయినా ఫలితం లేకపోతే తల్లిదండ్రులతో సమావేశం కావాలని సూచించారు. అంతేకాక విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో అవగాహన కల్పించాలని తెలిపారు.

ల్యాబ్‌లకు నిధులు

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్స్ చేసేలా ల్యాబ్‌ల్లో సౌకర్యాల కల్పనకు నిధులు విడుదల చేస్తామని ఉన్నత విద్యామండలి వెల్లడించింది. అవసరమైన సామగ్రిపై నివేదికలు ఇస్తే ఒక్కో కళాశాలకు రూ.25 వేల మేర చెల్లించనున్నట్లు తెలిసింది. అంతేకాక కళాశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు, అత్యవసర మరమ్మతులకు రూ.6 వేలు చొప్పున ఇస్తామని చెప్పారని సమాచారం.

మిగిలింది 90 రోజులే..

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు ఇంకా 90 రోజుల సమయమే ఉంది. దీంతో ఇప్పటి నుంచే ప్రణాళికాయుతంగా విద్యార్థుల హాజరు శాతం పెంచడం.. తద్వారా ఫలితాల పెంపునకు సైతం చర్యలు తీసుకోనున్నారు. ఇదే సమయంలో యాంటీ డ్రగ్స్ నివారణకు సంబంధిత శాఖల అధికారులతో అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమాలు ఇప్పటికే పలు కళాశాలల్లో నిర్వహిస్తుండగా.. మిగతా కళాశాలల్లో నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు.

కౌన్సిలర్ల ఏర్పాటు

వార్షిక పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థుల్లో ఉన్న భయాన్ని పొగొట్టేందుకు కౌన్సెలర్ల ద్వారా అవగాహన కల్పించనున్నారు. ఇందుకోసం బాలబాలికలకు వేర్వేరుగా కౌన్సిలర్లను నియమిస్తారు. అలాగే, కొన్ని కళాశాలల్లో ప్రిన్సిపాళ్లే కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ముందుకొచ్చారు.

ఆదేశాలను అమలు చేస్తాం..



ఇటీవల ఉన్నత విద్యామండలి కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచడంతో పాటు మెరుగైన ఫలితాలు సాధించేలా సూచనలు చేశారు. ఆ ఆదేశాలను అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 90 రోజులకు సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేశాం.

–రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

నా స్నేహితుడు మరోసారి 'మహా' సీఎం!

ఖమ్మంకు చెందిన వ్యాపారి సీతారాంబాబు



దేవేంద్ర ఫడ్నవీస్‌కు జ్ఞాపిక ఇస్తున్న సీతారాంబాబు (ఫైల్)

సాక్షిప్రతినిధి, భద్రాద్రికొత్తగూడెం: నాగపూర్ యూనివర్సిటీ లా కాలేజీలో తన సహచరుడైన దేవేంద్ర ఫడ్నవీస్ మహారాష్ట్ర సీఎంగా మరోమారు ప్రమాణ స్వీకారం చేయనుండడం ఆనందంగా ఉందని ఖమ్మంకు చెందిన వ్యాపారి వేములపల్లి సీతారాంబాబు తెలిపారు. లా కాలేజీ 1990 బ్యాచ్‌లో ఫడ్నవీస్, తాను కలిసి చదువుకున్నామని ఆయన గుర్తు చేశారు. అప్పట్లో ఏబీవీపీలో చురుగ్గా పని చేయడమే కాక కాలేజీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా తాను, కార్యదర్శిగా ఫడ్నవీస్ పోటీ చేశామని తెలిపారు. కాలేజీ రోజుల్లో ఐదుగురు స్నేహితులం కలిసి బ్యాచ్‌గా ఉండేవాళ్లమని చెప్పారు. ఆయన తొలిసారి 2015లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు స్నేహితులను ఇంటికి పిలిచి భోజనం పెట్టారని.. చివరగా 2023లో ఫడ్నవీస్‌ను కలిశానని తెలిపారు. త్వరలో ముంబై వెళ్లి వ్యక్తిగతంగా శుభాకాంక్షలు తెలియజేస్తామని, వచ్చే ఏడాది శ్రీరామనవమికి ఆయనను భద్రాచలం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానని సీతారాంబాబు వెల్లడించారు.

ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండలో కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన జాటోత్ రాములు కిరాణా దుకాణంలో రేషన్ బియ్యం నిల్వ ఉందనే సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎనిమిది క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

గురుకులంలో తహసీల్దార్ తనిఖీ



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్

వైరా: వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో భోజనం నాణ్యతగా లేదని, మెనూ అమలులో నిర్లక్ష్యం చేస్తున్నారని ఇటీవల అందిన ఫిర్యాదులతో తహసీల్దార్ శ్రీనివాస్ బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి భోజనం నాణ్యతను తెలుసుకున్నారు. భోజనం తయారీకి ఉపయోగిస్తున్న బియ్యంలో పురుగులు ఉన్నట్లు గమనించిన ఆయన అవి మార్చాలని ఎంఎల్ఎస్ పాయింట్ ఉద్యోగులకు సమాచారం ఇచ్చారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ రాము, ప్రిన్సిపాల్ సమత, అధ్యాపకులు ఉన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆరట్టు ఉత్సవం



స్వామి వారి ఆరట్టు ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

మధిర: మధిర లడక్‌బజార్‌లోని ఆలయంలో కొలువుదీరిన అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహానికి బుధవారం స్థానిక వైరా నదిలో భక్తుల సమక్షాన ఆరట్టు ఉత్సవం (నదీ స్నానం) నిర్వహించారు. వారం రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు నదీ స్నానంతో ముగిశాయి. ఈ మేరకు ఆలయం నుంచి పల్లకీలో స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని వైరా నది వద్దకు తీసుకువెళ్లి ప్రత్యేక పూజల అనంతరం నదీస్నానం జరిపించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. అంతకుముందు ఉదయం శివేలీ ప్రదక్షిణ, రాత్రి పడిపూజను తాళ్లూరి అప్పారావు దంపతుల ఆధ్వర్యాన నిర్వహించారు. పూజల్లో ఆలయ వ్యవస్థాపక నిర్వాహకులు చలువాది ధర్మారావు, చలువాది శ్రీనివాసరావు, దేవిశెట్టి రంగారావుతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'ఎవరెస్ట్' అధిరోహించాలని ఉంది..



మాట్లాడుతున్న మోతీకుమార్

ఖమ్మం మయూరిసెంటర్(ఖమ్మంమామిళ్లగూడెం): ప్రపంచంలో అతి ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరం అధిరోహించడానికి తనకు అవకాశం వచ్చిన నేపథ్యాన దాతలు సహకరించాలని పెనుబల్లి మండలానికి చెందిన బర్మావత్ మోతీకుమార్ కోరారు. ఖమ్మంలో బుధవారం ఆయన మాట్లాడారు. తన తల్లిదండ్రులకు ఇల్లు కూడా లేకపోగా కూలీకి వెళ్తే తప్ప పూట గడవదన్నారు. అయితే, ఆసక్తితో తాను గతంలో పలు పర్వతాలు అధిరోహించానని తెలిపారు. ఈనేపథ్యాన ఎవరెస్ట్ ఎక్కేందుకు అవకాశం వచ్చినందున దాతలు చేయూతనివ్వాలని మోతీకుమార్ కోరారు. దాతలు ఫోన్ పే ద్వారా 93464 33658 నంబర్‌కు సాయం పంపించాలని విజ్ఞప్తి చేశాడు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

రూ.5 లక్షల నగదు, ఆభరణాలు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న ఏసీపీ రెహమాన్

వైరా: వైరా బ్రాహ్మణపల్లిలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగింది. వైరాలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న షేక్ అఫ్జల్ గత నెల 28న భార్యకు చికిత్స చేయించేందుకు హైదరాబాద్ తీసుకెళ్లారు. బుధవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండగా లోపల పరిశీలిస్తే బీరువా తలుపులు కూడా పగులగొట్టి ఉన్నాయి. అందులో భద్రపర్చిన రూ.5 లక్షల నగదు, ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీపీ ఎంఏ రెహమాన్, సీఐ నూనావత్ సాగర్, ఎస్‌ఐ భాగ్యరాజ్‌తో పాటు క్లూస్ టీం సభ్యులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

తెల్లారినా వీడని మంచుతెరలు!



జిల్లా అంతటా ఉదయం వేళ మంచు దట్టంగా కమ్మేస్తోంది. కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉదయం 8గంటల వరకు కూడా మంచు తెరలు వీడకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించారు. అలాగే, వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లే రైతులు, కూలీలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. – కూసుమంచి

చెత్త వాహనాల అడ్డగింత

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం రాపర్తినగర్, బీసీ కాలనీ మీదుగా చెత్త వాహనాలను డంపింగ్ యార్డ్‌కు తరలించవద్దనే డిమాండ్‌తో స్థానికులు బుధవారం వాహనాలను అడ్డుకున్నారు. డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించకుండా అధికారులు ఏళ్ల తరబడి కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. దీంతో వాహనాలు నిలిచిపోగా అధికారులు చేరుకుని సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, అప్పటివరకు వాహనాలను వెళ్లనివ్వాలని కోరారు. అయినప్పటికీ స్థానికులు ససేమిరా అనడంతో చెత్తతో వచ్చిన వాహనాలను మరో మార్గంలో డంపింగ్ యార్డ్‌కు పంపించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

కారేపల్లి: బాలికను ప్రేమిస్తున్నానని నమ్మబలికి గర్భవతిని చేసిన యువకుడిపై కారేపల్లి పోలీసులు బుధవారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని చీమలపాడుకు చెందిన జయరాజు అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానని వెంటపడి నమ్మించి లోబర్చుకోవడంతో ఆమె గర్భం దాల్చింది. ఆ తర్వాత తనకేం సంబంధం లేదని తప్పించుకుని తిరుగుతుండగా బాలిక నిలదీస్తే చంపేస్తానని బెదిరించాడు. దీంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో జయరాజుపై కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్‌ఐ ఎన్.రాజారాం తెలిపారు.

పశువుల అపహరణకు యత్నం

మధిర: మండలంలోని ఆత్కూరు గ్రామంలో మహిళా రైతు ఇంటి వద్ద కట్టేసిన పశువులను బుధవారం పట్టపగలే దుండగులు అపహరించే ప్రయత్నం చేశారు. గ్రామానికి చెందిన మల్ల భాగ్యమ్మ ఇంటి వెనకాల ఖాళీ పశువులను కట్టేసి ఆమె కుమారులు వీరబాబు, నవీన్‌తో పాటు అందరూ మధిర అయ్యప్ప స్వామి గుడిలో పూజలకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన ముగ్గురు వ్యక్తులు రెండు ఆవులను తీసుకెళ్లి గ్రామ శివార్లలో కట్టేశారు. ఆ తర్వాత ఆవు దూడలను తీసుకెళ్లాలనే ప్రయత్నంలో ఉండగా భాగ్యమ్మ కుమారులు ఫోన్‌లో ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించగా ఆవులు, దూడలు కనిపించకపోవడంతో అప్రమత్తమయ్యారు. చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చి వెతుకుతుండగా గ్రామ సమీపంలో పశువులు ఉండటంతో అక్కడే ఉన్న గుర్తుతెలియని వ్యక్తికి దేహశుద్ధి చేశారు. ఆయన తనది మెదక్ జిల్లా పఠాన్‌చెరు అని, మరో ఇద్దరు పరారయ్యారని చెప్పగా మధిర టౌన్ పోలీసులకు అప్పగించారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

తల్లాడ: తల్లాడ సమీపాన బుధవారం ఆటో పల్టీ కొట్టిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. మల్లవరానికి చెందిన పలువురు మంగాపురంలో తమ బంధువు ఇరుముడి కార్యక్రమానికి హాజరై తిరిగి ఆటోలో ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో తల్లాడ ఎదుళ్లచెరువు సమీపాన ఆటో పల్టీ కొట్టింది. ఘటనలో దుగ్గిదేవర నాగబాబు, వరమ్మ, గాదె శివమ్మ, మూలగుండ్ల కళావతి, పూల కృష్ణవేణి, నీలం మంగమ్మ గాయపడగా చికిత్స నిమిత్తం 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

ఖమ్మంక్రైం: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మం ఎక్సైజ్‌స్టేషన్–2 ఇన్‌స్పెక్టర్ బి.చంద్రమోహన్ తెలిపారు. బుధవారం చేపట్టిన తనిఖీల్లో పాండురంగాపురానికి చెందిన షేక్ ఇస్మాయిల్ (బబ్లూ), నాగోపు సాకేత్, తాటికొండ సాయికృష్ణ పట్టుబడ్డారని పేర్కొన్నారు. వీరి నుంచి 150 గ్రాముల ఎండుగంజాయి, సెల్‌ఫోన్లు, మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే, సారథినగర్, తదితర ప్రాంతాలకు చెందిన యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఖమ్మంరూరల్ మండలం తహసీల్దార్ ఎదుట వద్ద బైండోవర్ చేశామని వెల్లడించారు.

చదువుకోవాలని ఉంది..

- ఆరోగ్యం బాగోలేక ఒకరు... తల్లిని చూసుకునేందుకే మరొకరు
- బడి మానేసి ఇంటి వద్దే ఉంటున్న విద్యార్థినులు
- ఇటీవల కుటుంబ సర్వేలో వెలుగుచూసిన వైనం
- దాతలు సహకరించాలని విన్నపం



తల్లి నాగమణితో చేకూరి నవ్య



అనారోగ్యంతో బాధపడుతున్న మానసతో సూపర్‌వైజర్ సురేశ్

నేలకొండపల్లి: ఆ విద్యార్థినులకు చదువుకోవాలని ఉంది.. కానీ పరిస్థితులు సహకరించడం లేదు. ఆరోగ్యం బాగా లేక ఓ విద్యార్థిని రెండేళ్లుగా ఇంటికే పరిమితం కాగా, మరో విద్యార్థిని తల్లికి సపర్యలు చేసేందుకు బడి మానేసింది. దాతలు చేయూతనిస్తే తప్ప వీరు చదువుకునే మార్గం కానరావడం లేదు. ఇటీవల ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేయించగా వారి ఇళ్లలో వివరాల సేకరణకు వెళ్లిన సూపర్‌వైజర్ ఇటిక్యాల సురేశ్, ఎన్యుమరేటర్ ఎస్.కల్యాణి ద్వారా ఈ అంశం వెలుగులోకి వచ్చింది.

తల్లిని చూసుకునేందుకు..

నేలకొండపల్లి మండలం కట్టుకాచారానికి చెందిన చేకూరి నవ్యశ్రీ 7వ తరగతి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివింది. 8వ తరగతి చదివేందుకు రాయగూడెం లేదా అప్పలనరసింహాపురం దాదాపు 4 కి.మీ. మేర వెళ్లాలి. అయితే, ఆమె తల్లి నాగమణి నరాల బలహీనతతో కదలలేని స్థితిలో మంచానికే పరిమితమైంది. ఇల్లు కూడా లేని నిరుపేద కుటుంబం కావడంతో తండ్రి వ్యవసాయ కూలీ పనులకు వెళ్తున్నారు. ఫలితంగా తల్లిని చూసుకునేందుకు ఎవరూ లేకపోవడంతో నవ్యశ్రీని బడి మాన్పించగా ఉన్నత చదువులు చదువాలనే ఆశ ఉన్నా ఆమె నిరాశ చెందుతోంది. ఆమె పక్క గ్రామంలో పాఠశాలకు వెళ్లడానికి సైకిల్ ఇప్పించడంతో పాటు తల్లి చికిత్సకు దాతలు సహకరిస్తే తప్ప నవ్యశ్రీ చదువు సాగే పరిస్థితులు లేవు.

కాళ్లు చచ్చుబడిపోవడంతో..

కట్టుకాచారానికి చెందిన బి.మానస స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి పూర్తిచేసింది. చదువులో అందరి కంటే ముందు నిలిచే ఆమెకు రెండేళ్ల కిందట ఎముల్లో గుజ్జు లేకపోవడంతో కాళ్లు చచ్చుపడ్డాయి. దీంతో పాఠశాల మానేసింది. మెరుగైన వైద్యం చేయించలేని గిరిజన కుటుంబం కావడంతో ఇంటి వద్ద మంచానికే పరిమితమైంది. ఆమెకు ట్రైసైకిల్ ఇప్పించి చికిత్సకు దాతలు సహకరిస్తే పాఠశాలకు వెళ్తానని చెబుతోంది. కాగా, ఈ విద్యార్థినుల దీనస్థితిని తెలుసుకున్న సర్వే సూపర్‌వైజర్ ఇటిక్యాల సురేశ్, ఎన్యుమరేటర్ ఎస్.కల్యాణి తమవంతు సాయం అందించారు. అయితే, మరి కొందరు దాతలు ముందుకొస్తే ఇద్దరు విద్యార్థినులకు బంగారు భవిష్యత్ సొంతమవుతుంది.

సాయం చేయాలనుకునే వారు...

చేకూరి నవ్య బ్యాంక్ ఖాతా నంబర్ 34708128266 (ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్ 0006315) లేదా 63035 08655 నంబర్‌కు ఫోన్ పే ద్వారా సాయం అందించవచ్చు.

మానస బ్యాంకు ఖాతా 73221801350 (ఏపీజీవీబీ చెరువుమాధారం బ్రాంచ్) లేదా 93817 28813 నంబర్ ద్వారా ఫోన్ పేకు జమ చేయాలని కోరుతున్నారు.

'విద్యారంగ సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి లేదు'



మాట్లాడుతున్న ఆజాద్

ఖమ్మంమయూరిసెంటర్: విద్యారంగం అభివృద్ధిని పట్టించుకోకపోగా, పలు పాఠశాలల్లో విద్యార్థులు ఆస్పత్రుల పాలవుతున్నా ప్రభుత్వం దృష్టి సారించడం లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ విమర్శించారు. ఖమ్మంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం కంటే మేలైన పాలన కొనసాగిస్తారని, విద్యారంగాన్ని గాడిలో పెడతారని భావిస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులను ఆస్పత్రుల పాలు చేస్తోందన్నారు. కుళ్లిన కూరగాయలు, నాసిరకమైన సరుకులతో వంటలు చేస్తున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.లక్ష్మణ్, వి.వెంకటేశ్, నాయకులు పృథ్వీ, ప్రసాద్, స్టాలిన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపూడి పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్

హెచ్‌ఎం, ఏజెన్సీ బాధ్యుల మధ్య వివాదమే కారణం

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి ప్రాథమిక పాఠశాలలో రెండు రోజులుగా మధ్యాహ్న భోజనం వండకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల కిందట పాఠశాల హెచ్‌ఎం జాన్, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు సుబ్బలక్ష్మి మధ్య వివాదం నెలకొంది. భోజనం నాణ్యతగా ఉండటం లేదని హెచ్‌ఎం ఆగ్రహం వ్యక్తం చేయడంతో, తాను నాణ్యతా ప్రమాణాలతోనే భోజనం వండుతున్నానని సుబ్బలక్ష్మి బదులిచ్చింది. ఈ వివాదం కారణంగా మధ్యాహ్న భోజనం సిద్ధం చేయలేనని ఆమె చేతులెత్తేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లును వివరణ కోరగా సమస్య పరిష్కారమైందని, గురువారం నుంచి మధ్యాహ్న భోజనం అమలవుతుందని తెలిపారు.